సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 19 । మే । 2025



లోతు దుక్కులతో మేలు

తొలకరి వర్షాలు కురిసినప్పుడు మెట్ట ప్రాంతాల్లో వర్షాధార పంటలు పండించే భూములకు లోతు దుక్కులు మేలు చేస్తాయి. 8లో



ఎరువులతో అనర్థాలు

అధిక దిగుబడి కోసం విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడితే అనర్థాలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. 8లో



భారీ వర్షం

తాడేపల్లిగూడెం పట్టణం, భీమవరం మండలంలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 8లో

అలుపెరుగని పోరాటం

కూటమిపై పోరుబాట

- సమస్యల పరిష్కారం కోసం సీహెచ్‌ఓల గళం
- 22 రోజులుగా సమ్మెలో..
- ధర్నాలు, ర్యాలీలతో నిరసన ప్రదర్శనలు
- విలేజ్ క్లినిక్‌ల్లో నిలిచిన వైద్య సేవలు
- అయినా పట్టించుకోని ప్రభుత్వం
- జిల్లాలో 364 మంది సీహెచ్‌ఓల ఆక్రందన



భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

భీమవరం (ప్రకాశం చౌక్) : ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విలేజ్ క్లినిక్‌ల్లో వైద్య సేవలు అందించే సీహెచ్‌ఓలు (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్) అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. 22 రోజులుగా విధులు బహిష్కరించి భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్నారు. మండుటెండల్లోనూ ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తూ గళం వినిపిస్తున్నాయి. అయినా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. జిల్లాలో 364 విలేజ్ క్లినిక్‌లు ఉండగా 364 మంది సీహెచ్‌ఓలు సమ్మెలో ఉన్నారు. శాంతియుతంగా ధర్నాలు చేయడంతో పాటు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితర ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. పలు సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు వీరికి మద్దతు తెలుపుతున్నాయి. కరోనా, విపత్తుల సమయాల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామని, అయినా తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

నిలిచిన పల్లె వైద్యం

జిల్లావ్యాప్తంగా సీహెచ్‌ఓలు సమ్మెలో ఉండటంతో విలేజ్ క్లినిక్‌ల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు దూరమయ్యాయి. అయితే ప్రభుత్వం మాత్రం ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లతో విలేజ్ క్లినిక్‌లు నడిపిస్తుంది. దీంతో నామమాత్రంగా సేవలందుతున్నాయని ప్రజలు అంటున్నారు. కొన్నిచోట్ల విలేజ్ క్లినిక్‌లు మూతపడటంతో ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు.

సీహెచ్‌ఓల డిమాండ్లు

- 6 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారిని రెగ్యులరైజ్ చేయాలి.
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలి.
- పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరించాలి.
- ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలి
- క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించాలి.
- నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలి.
- ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలు మినహాయింపు ఇవ్వాలి.
- ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలి.
- జిల్లాలోని 145 క్లినిక్‌ల ఏడాది అద్దెలు, విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించాలి
- ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ కోసం సీహెచ్‌ఓలు వెచ్చించిన సుమారు రూ.1.90 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేయాలి.

22 రోజులుగా పోరాటం



గత 22 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నాం. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే సీహెచ్‌ఓలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలి.

–పి.శిరీష, సీహెచ్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షురాలు

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆరేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం కోతలు లేకుండా జీతం ఫిక్స్‌డ్‌గా ఇవ్వాలి. క్లినిక్ వద్ద రక్షణ చర్యలు కల్పించాలి. ఆగస్టు 2022న కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు మా సర్వీసులు క్రమబద్ధీకరించాలి.

–ఆర్.మాధురి, సీహెచ్‌ఓ

అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా..



జిల్లాలోని 364 మంది సీహెచ్‌ఓలు సమ్మెలో ఉన్నారు. శాంతియుతంగా నిరసనలు చేపట్టి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం పట్టించుకోవాలి. గ్రామీణ ప్రజలకు సీహెచ్‌ఓల సేవలు అవసరం. కాగా సేవలందించలేకపోతున్నామని బాధపడుతున్నాం.

–కె.సూర్య, జిల్లా కో– ఆర్డినేటర్

న్యాయం చేయాలి



కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర ఉన్నత అధికారులకు వినతి పత్రాలు అందజేసి మా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం. ప్రభుత్వం మా నిరసనలు గుర్తించి చర్చలకు పిలవాలి. ఉద్యోగ భద్రత కోసం మేం పడే ఇబ్బందులను గుర్తించి న్యాయం చేయాలి.

–పి.నాగజ్యోతి, సీహెచ్‌ఓ

సేవలు గుర్తించాలి



కరోనా విపత్తు సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించాం. మా సేవలను గుర్తించి సమస్యలు పరిష్కరిస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తాం. ఉద్యోగ భద్రత, మాపై ఆధారపడిన ఉన్న కుటుంబం కోసం ప్రయోజనాలు అడుగుతున్నాం.

–డి.రత్నం, సీహెచ్‌ఓ

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



మాట్లాడుతున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం: దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం గునుపూడిలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సభ్యులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మోషన్‌రాజు ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మోషేన్‌రాజు మాట్లాడుతూ దేశానికి రాజ్యాంగం దిక్సూచిగా ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా ప్రజలందరినీ సమానంగా చూసేదే రాజ్యాంగం అన్నారు. ప్రతి ఇంట్లో పవిత్ర గ్రంథాలతోపాటు రాజ్యాంగం కూడా ఉండాలన్నారు. అంబేడ్కర్‌ను రాజ్యాంగానికి మాత్రమే పరిమితం చేయకూడదని, ఆయన జీవితంలో చేసిన ఎన్నో సాంఘిక, రాజకీయ పోరాటాలు ఉన్నాయని గుర్తుచేశారు. అంబేడ్కర్ నాటక ప్రదర్శన అద్భుతంగా ఉందని, అకాడమీ సభ్యులు ఈ నాటకాన్ని గ్రామాల్లో కూడా ప్రదర్శించాలని కోరారు. ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని రాజ్యాంగ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో ఈ కళారూప నాటక ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నరసాపురం ఆర్డీఓ దాసి రాజు రూ.50 వేల ప్రోత్సాహకాన్ని మోషేన్‌రాజు చేతులమీదుగా కళాకారులకు అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆక్రమిత భూముల పరిశీలన



గొల్లలకోడేరులో స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు : మండలంలోని గొల్లలకోడేరులో యనమదుర్రు డ్రెయిన్ గట్టుపై ఉన్న ఆక్రమిత స్థలాలను కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం నేరమని, త్వరలో ఆక్రమణల స్వాధీనానికి సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం గ్రామంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు చేపడతామని నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి, ఎంపీడీఓ వి.రెడ్డియ్య, ఇరిగేషన్ డీ తదితరులు ఉన్నారు.

నిమ్మకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): నిమ్మకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నిమ్మకాయల ధర పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి నుంచి మే వరకు నిమ్మకు అధిక ధర ఉండే సమయమని, అయినా ప్రస్తుతం ధర తగ్గిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు ఈదురుగాలులు, అకాల వర్షాలతో నిమ్మ రైతులు నష్టపోతున్నారన్నారు. నిమ్మ ఎగుమతులు సక్రమంగా లేకపోవడం కూడా నష్టాలకు కారణంగా ఉందని, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కిలో నిమ్మకాయలకు రూ.100 ధర రావాల్సి ఉండగా రూ.30లోపు మాత్రమే ఉందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యుడు జి.సురేష్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 629 మంది హాజరు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరులోని రెండు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు 629 మంది విద్యార్థులు హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 180 మందికి 175 మంది, మధ్యాహ్నం 180 మందికి 174 మంది హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 144 మందికి 140 మంది, మధ్యాహ్నం 144 మందికి 140 మంది హాజరయ్యారు.

ఘనంగా గంగాదేవి అమ్మవారి జాతర



అమ్మవారి ఆలయంలో సినీ హీరో నిఖిల్

పాలకోడేరు: మోగల్లు గ్రామంలో గంగాదేవి అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. జాతరకు సినీ హీరో నిఖిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి గ్రామానికి బంధువులు తరలివచ్చారు. గ్రామస్తులతో పాటు బంధువులు ఆలయంలో అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. చలిమిడి పానకాలతో మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో మేళతాళాలు కోయ డ్యాన్సులు, బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. హీరో నిఖిల్‌ను చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపారు. ఎస్సై మంతెన రవి వర్మ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

నేడు మండల పరిషత్ ఉప ఎన్నికలు

అత్తిలి, యలమంచిలిలో ఎన్నికలు



అత్తిలి మండల పరిషత్ కార్యాలయం

అత్తిలి: అత్తిలి మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు సోమవారం ఉప ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వాస్తవంగా మార్చి 27న ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను కూటమి నాయకులు అడ్డుకోవడంతో ప్రక్రియ నిలిచింది. మరుసటి రోజున ఎన్నికలకు అధికారులు ఏర్పాటుచేసినా మరలా కూటమి శ్రేణులు భారీగా చేరుకుని ఎంపీటీసీ సభ్యులను మండల పరిషత్ కార్యాలయానికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మరలా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నేపథ్యంలో గతంలో మాదిరిగా పెద్ద ఎత్తున పోలీసు బలగాలు అత్తిలి చేరుకున్నాయి.

యలమంచిలిలో ఎంపీపీ ఎన్నిక

యలమంచిలి: యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరుగనున్న మండల పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని డ్వామా పీడీ, ప్రిసైడింగ్ అధికారి కేసీహెచ్ అప్పారావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తామని, ఒకే నామినేషన్ వస్తే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటిస్తామని చెప్పారు. ఒకటికి మించి నామినేషన్లు దాఖలైతే సభ్యులు చేతుల ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో మండల పరిషత్ కార్యాలయానికి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, మండల పరిషత్ సభ్యులు, ప్రోటోకాల్ ఉన్నవారిని మాత్రమే లోపలకు అనుమతి ఇస్తామని పేర్కొన్నారు.

మూల్యాంకనం.. సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ వాల్యుయేషన్
- జిల్లాకు వచ్చిన 81,469 జవాబుపత్రాలు
- 13,48 మంది ఎగ్జామినర్ల నియామకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఇంటర్మీడియెడ్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. గతంలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వేర్వేరుగా మూల్యాంకనం జరగ్గా ప్రస్తుతం పేపర్లు తక్కువగా ఉండటంతో ఈ రెండు జిల్లాలకు సంబంధించి ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూల్యాంకనానికి ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి తొలి విడత మూల్యాంకనం ప్రారంభం కానుండగా ఈనెల 21 నుంచి రెండో విడత ప్రారంభం అవుతుంది. ఈనెల 31న మూల్యాంకనం ముగియనుంది.



ఏలూరులో కోటదిబ్బ జూనియర్ కళాశాల

81,469 పేపర్లు

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు రాసిన జవాబు పత్రాలు అన్ని సబ్జెక్టులు కలిపి జిల్లాకు 81,469 పేపర్లు వచ్చాయి. వీటిలో సంస్కృతం 5,249, తెలుగు 1,821, హిందీ 39, ఇంగ్లిష్ 12,830, గణితం–ఏ 13,424, గణితం–బీ 12,727 పేపర్లు ఉన్నాయి. అలాగే సివిక్స్ 3,152, బోటనీ 2,276, జువాలజీ 3,185, హిస్టరీ 335, ఫిజిక్స్ 9,797, ఎకనామిక్స్ 3,668, కెమిస్ట్రీ 10,683, కామర్స్ 2,283 పేపర్లు వచ్చాయి. మొత్తం 81,469 పేపర్లలో ప్రథమ సంవత్సరం జవాబుపత్రాలు 71,423, ద్వితీయ సంవత్సరం జవాబుపత్రాలు 10,046 ఉన్నాయి. ఈ మేరకు ఎగ్జామినర్లకు విధులు కేటాయించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి మొత్తం 1,348 మంది ఎగ్జామినర్లను విధులకు నియమించారు.

ఎగ్జామినర్ల నియామకం

సబ్జెక్టు	ఎగ్జామినర్లు		
ఇంగ్లిష్	124	ఫిజిక్స్	203
గణితం	205	ఎకనామిక్స్	87
సివిక్స్	57	కెమిస్ట్రీ	211
తెలుగు	79	హిస్టరీ	31
హిందీ	11	బోటనీ	88
సంస్కృతం	66	జువాలజీకి	96
		కామర్స్	90

7 కేంద్రాలు.. 15,707 మంది విద్యార్థులు

నేటి నుంచి ఈఏపీసెట్



భీమవరం: ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏపీఈఏపీసెట్ పరీక్షలు సోమవారం నుంచి ఈనెల 27 వరకు జరుగనున్నాయి. జిల్లాలోని ఏడు కేంద్రాల్లో పరీక్షలకు 15,707 మంది హాజరుకానున్నారు. భీమవరంలో డీఎన్నార్ అటానమస్, డీఎన్నార్ ఇంజనీరింగ్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్, విష్ణు ఇంజనీరింగ్, విష్ణు ఉమెన్స్ ఇంజనీరింగ్, నరసాపురంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్, తాడేపల్లిగూడెంలో శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటుచేశారు. భీమవరంలోని ఐదు కేంద్రాల్లో ఇంజనీరింగ్ పరీక్షలకు 5,662 మంది, అగ్రి, ఫార్మసీ పరీక్షలకు 1,477 మంది, నరసాపురంలో ఇంజనీరింగ్ పరీక్షలకు 1,501, అగ్రి, ఫార్మసీ పరీక్షలకు 600 మంది, తాడేపల్లిగూడెంలో ఇంజనీరింగ్ పరీక్షలకు 4,527 మంది, అగ్రి, ఫార్మసీ పరీక్షలకు 1,911 మంది హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్న 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్ష సమయానికి 1.30 గంటల ముందు నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

సందేశాత్మకంగా నాటిక ప్రదర్శనలు



ద్వారబంధాలు నాటికలో ఓ సన్నివేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరులో అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం, హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటిక పోటీలు రెండోరోజు ఆదివారం కొనసాగాయి. అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పోటీలు నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన సభ లో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ అంబికా కుటుంబ సేవలు అభినందనీయమన్నారు. ప్రముఖ సాహితీవేత్త, భాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ గౌరవ ఫెల్లో ప్రొఫెసర్ డాక్టర్ వేల్చేరు నారాయణరావుకు 11వ తానా–గిడుగు రామమూర్తి తెలుగు భాషా పురస్కారాన్ని తానా నాయకులు గొర్రిపాటి చందు, వీఎల్ఎంఆర్ వెంకటరావు అందించి సత్కరించారు. నాటిక పోటీల్లో భాగంగా గోవాడ క్రియేషన్ (హైదరాబాద్) వారి అమ్మ చెక్కిన బొమ్మ, కృష్ణా ఆర్ట్స్–కల్చరల్ అసోసియేషన్ (గుడివాడ) వారి ద్వారబంధాల చంద్రయ్య నాయుడు నాటికలు అలరించాయి.

కొనసాగుతున్న గిరిజనుల దీక్షలు



దీక్షలో కుర్చున్న జేఏసీ నాయకులు


బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం కొండరెడ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పట్ల రమేష్‌కుమార్ రెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, ఏటీఏ రాష్ట్ర గౌరవ సలహాదారు తెల్లం రాములు, జేఏసీ నాయకులు కుంజా వెంకటేశ్వరరావు, సోదెం ముక్కయ్య, రవ్వా బసవరాజు, తదితరులు నిరాహార దీక్షలో కుర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్లు నెరవేరే వరకూ దీక్షలు కొనసాగుతాయని చెప్పారు. జేఏసీ నాయకులు పాల్గొన్నారు.


నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 40 కేంద్రాల్లో పరీక్షలకు 7,707 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా ప్రారంభం కానున్నాయని, వీటి కోసం 11 కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు చెప్పారు.

చటాకాయిలో ఉద్రిక్తత

- చెరువుల డబ్బుల పంపిణీలో వివాదం
- సర్పంచ్ శేషారావుపై దాడి
- పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం





ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతాలక్ష్మి, దాడిలో గాయపడిన సర్పంచ్ శేషారావు

కైకలూరు: చేపల చెరువుల వాటా డబ్బుల పంపిణీ వివాదం చటాకాయి గ్రామంలో ముదిరిపాకాన పడింది. గ్రామంలో ఉమ్మడిగా సాగు చేస్తున్న 9 చెరువుల్లో వచ్చే ఆదాయం సమానంగా పంచడం లేదంటూ గ్రామస్తుల్లో కొందరు శనివారం ఏలూరు అటవీ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం గ్రామంలో రెండు వర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. గ్రామానికి ఆదాయాన్ని అందించే చెరువులను ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేసి పొక్లెయిన్లతో కొట్టేయడానికి ఓ వర్గం ప్రయత్నిస్తున్నారని మైక్‌లలో ప్రచారం చేయడంతో వివాదం మొదలైంది. సర్పంచ్ ఘంటసాల శేషారావును గ్రామ కమ్యూనిటీ హాలు వద్ద వాటాల విషయంపై చర్చించుకోవడానికి పిలిచి ఓ వర్గం దాడి చేశారనే వార్త తెలియడంతో ఆయన కుమారుడు మరికొందరు అక్కడికి వెళ్లారు. ఈ నేపథ్యంలో గ్రామంలో జయమంగళ లెవెన్‌రాజు, ఘంటసాల లక్ష్మయ్య, ఆయన కుమారుడు నాగరాజు, మోరు నాగేశ్వరరావులపై దాడి చేశారు. జయమంగళ సీతాలక్ష్మిపై దాడి చేయడంతో ఆమె మనస్తాపంతో ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. జరిగిన ఘటనలను కవర్ చేయడానికి వెళ్లిన మీడియాపై సైతం ఓ వర్గం వాదనకు దిగింది. ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ, దాడికి గురైన వ్యక్తులను కైకలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకుని రూరల్ ఎస్సై రాంబాబు సిబ్బందితో చటాకాయి గ్రామానికి వెళ్లి పరిస్థితిని అదుపుచేశారు. ఇరు వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.



సిరుల తల్లి.. కల్పవల్లి

పెదవేగి: భక్తుల పాలిట కొంగు బంగారం రాట్నాలకుంటలో రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయానికి పూజా టికెట్లపై రూ.57,410, విరాళాల రూపంలో రూ.5,338, లడ్డూ ప్రసాదంపై రూ.31,950, ఫొటోల అమ్మకంపై రూ.3,855 మొత్తం రూ.98,553 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు.

రసాయన ఎరువులతో అనర్థాలు

సేంద్రియ పద్ధతులే మేలంటున్న అధికారులు

చింతలపూడి: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుంది. రైతులు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంట పండించ డానికి విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా భూముల్లో పంటకు కావలసిన పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపించి ముందెన్నడూ లేని విధంగా ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు కనిపిస్తున్నాయి. ఈ పోషకాలు లోపించినప్పుడు సాగులో మిగతా యాజమాన్య పద్ధతులన్నీ సక్రమంగా పాటించినా దిగుబడులు తగ్గుతాయి. వీటిని అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ సూచిస్తున్నారు.

చింతలపూడి సబ్‌డివిజన్ పరిధిలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 35,500 ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. 350 ఎకరాల్లో మొక్కజొన్న, 160 ఎకరాల్లో వేరుశెనగ పండిస్తారు. రబీ సీజన్‌లో సుమారు 1,500 హెక్టార్లల్లో వరి, 18,000 హెక్టార్లలో మొక్కజొన్న, 2,500 హెక్టార్లలో వేరుశెనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు.

జిప్సంతో మంచి దిగుబడి

జిప్సంలో 24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉంటుంది. కాల్షియం, గంధకం మొక్కల పెరుగుదలకు అవసరమైన ద్వితీయ పోషకాలను చౌకగా జిప్సం అందిస్తుంది. ముఖ్యంగా నూనె గింజలు, పప్పు ధాన్యాల వంటి పంటల్లో గంధకం ఆవశ్యకత ఉంటుంది. కాల్షియం మొక్కల్లోని జీవకణాల అంచులు గట్టిగా ఉండటానికి, కణ విభజనకు, వేర్ల అభివృద్ధికి, గింజ కట్టడానికి అవసరమవుతుంది. దీని వల్ల మొక్కలకు చీడపీడలు ఎదుర్కొనే శక్తి సమకూరుతుంది. వేరుశెనగ పంటలో అధిక దిగుబడులకు జిప్సం పూత దశలో వేసుకుని భూముల్లో కలియ బెట్టడం వల్ల అధిక దిగుబడులు వస్తాయి. వేరుశెనగలో జిప్సం వినియోగం వల్ల కాయలు గట్టిగా ఉండి కాయ నిండా పప్పు వృద్ధి చెంది గింజల్లో అధిక నూనె శాతం ఉంటుంది. ఫలితంగా కాయలు అధిక బరువు ఉండి మంచి ధర పలుకుతాయి. పూత సమయంలో ఎకరాకు 200 కిలోల చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా జిప్సం వేసుకోవాలి. బీడు, చౌడు భూముల్లో నీరు సరిగా ఇంకదు. గాలి ప్రసరణ తక్కువగా ఉంటుంది. భూమి భౌతిక లక్షణాలు క్షీణించి ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మొక్కల వేర్లు సరిగా వృద్ధి చెందక మొక్కల్లో ఎదుగుదల ఉండదు. ఇలాంటి భూముల్లో జిప్సం వినియోగం వల్ల నేల గుల్లబారి భూమిలో నీరు ఇంకే స్వభావం పెరిగి మొక్కల వేర్లు బాగా వృద్ధి చెందుతాయి. పంట దిగుబడి పెరుగుతుంది.



మెట్ట ప్రాంతంలో రైతులు పండిస్తున్న వేరుశెనగ(ఫైల్)



బోర్ల కింద రైతులు వేసిన నారుమళ్లు



బి.నాగకుమార్, ఏడీఏ, వ్యవసాయ సబ్‌డివిజన్

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



ఘటనా స్థలంలో పడి ఉన్న ద్విచక్ర వాహనం

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఉండ్రాజవరం పోలీసు స్టేషన్ పరిధిలోని కమ్మ కల్యాణ మండపం ఎదురుగా తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న 108 వాహన సిబ్బంది అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఉండ్రాజవరం ఎస్సై జి.శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఏపీ 05 ఈఆర్ 9840 నెంబర్ హోండా బైక్‌పై ప్రయాణిస్తున్న మృతుడు ధరించిన దుస్తుల్లో సెల్‌ఫోన్, కాగితాలు లేకపోవడంతో వివరాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ గుడిలో భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు పడ్డాయి. వాతావరణంలో మార్పులతో భక్తులు త్వరగా దర్శనాలు చేసుకుని బయటకు వెళ్ళాలని కమిటీ వారు సూచించారు. సాయంత్రం 4 గంటలలోపే భక్తులందరూ తమ పూజా కార్యక్రమాలను ముగించుకుని బయటకు వచ్చారు.

శ్రీవారి క్షేత్రంలో కొనసాగిన రద్దీ



భక్తులతో నిండిపోయిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ ఆదివారం సైతం కొనసాగింది. వేసవి సెలవులు కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. దాంతో అన్ని విభాగాలు భక్తులతో పోటెత్తాయి. ముఖ్యంగా దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిసాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. వేంకటేశ్వర స్వామివారిని తూర్పుగోదావరి జిల్లా అడిషినల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మరణించిన సాల్మన్

గణపవరం: గణపవరం మండలం సరిపల్లె శివారు ఫ్యాక్టరీ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. గణపవరం ఎస్సై ఆకుల మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కల్లిగొట్ల గ్రామానికి చెందిన బిరుదగడ్డ సాల్మన్, దాసరి మురళి ఆదివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై గణపవరం వస్తుండగా సీపీ మేతల కంపెనీ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో సాల్మన్ అక్కడిక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడిన దాసరి మురళిని అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో అనేక పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్‌లు పొంగి ప్రవహించాయి. చాలా రోడ్లు కాలువల్లా దర్శనమిచ్చాయి. దాదాపు గంటన్నరకు పైగా సాధారణ జన జీవనం స్తంభించింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులకు అంతరాయం ఏర్పడింది. మునిసిపల్ హెహికల్ డిపో ఎదురుగా సీసీ రహదారి కల్వర్టుకు అడ్డంకి ఏర్పడటంతో బురద నీరు రోడ్డుపైకి చేరింది. అనేక ప్రాంతాలు చెత్త చెదారాలతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. బస్టాండ్‌లో నీరు నిలిచిపోయింది. కె.ఎన్.రోడ్డులో అనేక చోట్ల మార్జిన్‌లలో నీరు నిలిచిపోవడంతో వ్యాపారస్తులు ఇబ్బంది పడ్డారు. అయితే చల్లని గాలులతో పట్టణ ప్రజలు సేదదీరారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, అనాకోడేరు, కొమరాడ, తోకతిప్ప, కొత్తపూసలుమర్రు తదితర గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం పడింది. దీంతో పలు గ్రామాలలోని శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



తాడేపల్లిగూడెంలో మేఘావృతమైన ఆకాశం



హెహికల్ డిపో సమీపంలో పొంగుతున్న డ్రెయిన్

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్ ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ళశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. స్వామిని దర్శించుకునే భక్తులు అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొంటే మేలు జరుగుతుందనే విశ్వాసం ఉంది. దీంతో అన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తడంతో ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. స్వామికి గుడివాడకు చెందిన వన్నెంరెడ్డి మధుసూదనరావు కుటుంబసభ్యుడు దినేష్ వెండి పుష్పమాలను అందజేశారు.



పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

మట్టి లారీలపై గ్రామస్తుల ఆందోళన

కొయ్యలగూడెం: మండలంలోని దిప్పకాయలపాడు శివారు దళిత పేటలో మట్టి తోలకాలను అడ్డుకుని స్థానికులు ఆందోళన చేశారు. ఆదివారం సాయంత్రం దాదాపు యాభై మందికి పైగా యువకులు మట్టి తోలకాల వల్ల రోడ్లు అధ్వానంగా మారాయంటూ వాగ్వాదానికి దిగారు. సుమారు పాతికకు పైగా లారీలను నిలిపేసి రోడ్డుపై బైఠాయించారు. పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం లారీలు ప్రయాణిస్తుండటంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి సెలవుల కారణంగా పిల్లలు బయట ఎక్కువగా తిరుగుతున్నారని, ఈ లారీల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. వెంటనే చర్యలు తీసుకొని, మట్టి లారీల రవాణాపై నియంత్రణ విధించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జలవనరుల శాఖ సబ్ డివిజన్ అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చర్యలు తీసుకోలేకపోతున్నారని ప్రచారం సాగుతోంది.



దిప్పకాయలపాడులో మట్టి తోలకాలు అడ్డుకొని ఆందోళన చేస్తున్న యువకులు

అభయాంజనేయస్వామికి మల్లెపూలతో పూజ



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మహిళల కోలాట ప్రదర్శన



అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న భైరవం సినిమా టీం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మల్లెపూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు భజన మండలిచే సంప్రదాయ సంకీర్తనలు నిర్వహించారు. సాయంత్రం విజయదుర్గ కోలాట బృందంచే కోలాటం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు వెండి బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, నక్షత్ర హారతి నిర్వహించారు. శ్రీ విజయదుర్గా నాట్య మండలి బృందం సత్యహరిశ్చంద్ర కాటి సీను ప్రదర్శించింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ నెల 30న భైరవం సినిమా రిలీజ్ పురస్కరించుకుని అభయాంజనేయస్వామి ఆలయంలో సినీ నటులు మంచు మనోజ్, నారా రోహిత్, విజయ్ కనకమేడల, కేకే రాధామోహన్ స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదాశీర్వాదం అందించారు.

శ్రీమన్నారాయణుడికి చందనోత్సవం

రేపటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనారాయణ స్వామికి చందనోత్సవం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని శ్రీ చతుర్భుజ లక్ష్మీతాయారు సమేత శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయం(చినగోపురం లో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి చందనోత్సవం నిర్వహించారు. ఉదయం సహస్రనామ పూజలు, అలంకార తిరుమంజనం, సుప్రభాతసేవ, స్వస్తివాచకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారిని పట్టణ పురవీధుల్లో రథంపై ఊరేగించారు. సోమవారం వసంతోత్సవం, ధ్రువ మూర్తుల తిరుమంజనం, మహా పూర్ణాహుతి, ఏడు ముసుగుల ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ ఈవో బిరుదుకోట శంకర్ తెలిపారు. కార్యక్రమాలను ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు మాజేటి రాంబాబు, మామిడి బాబు, రేపాక ప్రవీణ్‌భాను, మాజేటి సూర్యభవానీ, మాచేపల్లి నాగఅన్నపూర్ణ, రేపాక సుబ్బారావు, దేవత భాస్కరరావు, నున్న కోటేశ్వరరావు, తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

పెద్దింట్లమ్మా... చల్లంగా చూడమ్మా..



కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి



పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తుల రద్దీ

కైకలూరు: అమ్మా పెదింట్లమ్మా.. నీ చల్లనీ దీవెనలు మాకు అందించమ్మా.. అంటూ భక్తులు అమ్మను భక్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మను సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. కోనేరులో స్నానాలు చేసి అమ్మవారికి భక్తులు వేడి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం రోజున ప్రత్యేక, అంతరాయ దర్శనాలు, కేశఖండనశాల, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూ ప్రసాదాలు, గదుల అద్దెలు, అమ్మవారి చిత్రపటాలు విక్రయం, భక్తుల విరాళాల ద్వారా రూ.78,001 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఇద్దరికి రిమాండ్

భీమవరం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి కొత్త బస్టాండ్ దగ్గరలోని ఎస్ఆర్‌కె లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు చెప్పారు. గాడి సత్యనారాయణ, ముంగర సురేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారన్నారు.

మందలించారని యువకుడి ఆత్మహత్య

ఉండి: పనికి వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించగా మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం పెరవలి మండలం పిట్లవేమవరానికి చెందిన కుడుపూడి సత్యశంకర్ (22) ఉండి మండలం కోలమూరులో మోటార్ రీవైండింగ్ పనులు చేసే షాపులో పని చేస్తున్నాడు. పనికి సరిగా వెళ్లడం లేదని తెలియడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటల సమయంలో పని చేసే దుకాణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన గణేష్ అనే వ్యక్తి దుకాణం యజమానికి సమాచారం అందించాడు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు, అనంతరం గుంటూరుకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోస్టల్ ఉద్యోగిని ఆత్మహత్య



కృష్ణ సంగీత, మృతురాలు

ఏలూరు టౌన్: ఏలూరు కొత్తపేటకు చెందిన పోస్టల్ ఉద్యోగిని కృష్ణ సంగీత (29) ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎన్ఆర్‌పేటలోని పోస్టల్ కార్యాలయంలో అసిస్టెంట్ పోస్టల్ అధికారిగా పనిచేస్తున్న ఆమె ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె తండ్రి, న్యాయవాది పుచ్చల వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణ సంగీతకు విశాఖపట్నంకు చెందిన నక్కిన శశికిరణ్‌తో 2024 డిసెంబర్ 5న వివాహమైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న శశికిరణ్ పెళ్లయిన కొద్దిరోజులకే ఉద్యోగం మానేసి ఖాళీగా ఉండేవాడు. ఎస్ఆర్ పేట పోస్టల్ కార్యాలయంలో పనిచేస్తున్న కృష్ణ సంగీతను ఉద్యోగం మానేసి విశాఖపట్నం రావాలని ఒత్తిడి చేసేవాడు. ఆమె జీతాన్ని సైతం భర్తకే పంపేదని.. కట్నకానుకలుగా ఇచ్చిన స్థలాలు సైతం అతని పేరుమీద రాయాలని వేధించేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త వేరే మహిళలతో ఉంటున్న ఫొటోలను పంపి వేధించేవాడని.. భర్తతో పాటు అత్తమామలు సైతం అదనపు కట్నం కావాలని వేధిస్తూ ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడిందని ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్‌కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోతు దుక్కులతో మేలు



పాడి - పంట

ముసునూరు: మెట్ట ప్రాంతాల్లో వర్షాధార పంటలు పండించే భూములకు వేసవి (లోతు) దుక్కులు ఎంతో ప్రయోజనకరం. ఈ నేపథ్యంలో జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులు వర్షాలు పలకరిస్తుండడంతో వేసవి దుక్కులపై దృష్టి పెట్టారు. తొలకరి వర్షాలు కురిసినపుడు భూమిని లోతుగా దుక్కి చేసుకోవడం వల్ల భూమి పై పొరలు లోపలికి, లోపలి పొరలు బయటకు చేరి, చేనుకు మంచి చేస్తుందని రైతులు చెబుతున్నారు.

లోతు దుక్కుల ప్రాధాన్యత:

- దుక్కి లోతుగా చేయడం పండించే పంటపై ఆధార పడి ఉంటుంది. ప్రతి మూడేళ్లకు ఒకసారి పెద్ద మరతో 30 సెం.మీ లోతు వరకు దుక్కు చేయడం మంచిది. ఏటా వర్షాలను బట్టి భూమిని 15–20 సెం.మీ లోతు వరకు దున్నుకోవాలి.
- సాధారణంగా తల్లి వేరు వ్యవస్థ, పీచు వేరు వ్యవస్థ ఉన్న పంటలకు తక్కువ లోతు దుక్కి సరిపోతుంది. తేలికపాటి నేలల్లో 1–3 సార్లు దున్నాలి. కలుపు మొక్కలు, పంటల అవశేషాలు ఎక్కువగా ఉంటే కనీసం మూడు దఫాలుగా దున్నాలి.

వేసవి దుక్కులకు అనుకూల పరిస్థితులు

- భూమిలో నిల్వ ఉంచుకునే తేమ 25 నుంచి 50 శాతం ఉంటే అది దుక్కులకు పూర్తి అనుకూలం.
- భూమిలో తేమ తక్కువ ఉన్నప్పుడు దుక్కి దున్నకూడదు. దీని వల్ల భూమి గుల్ల బారదు.
- భూమిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు నాగలికి మట్టి అంటుకుంటుంది. కింద ఉన్న మట్టి గట్టిపడి, భూమిలో గట్టి పొరలు ఏర్పడతాయి.



ముసునూరులో వేసవి దుక్కు దున్నుతున్న రైతు

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

- వేసవి దుక్కులతో నేల గుల్ల బారుతుంది. తదుపరి వచ్చే వర్షపు నీరు వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవచ్చు.
- తగినంత తేమ ఉన్నప్పుడు నేలను లోతుగా వాలుకు అడ్డంగా దున్నడం వల్ల నేల కోతను నివారించి, భూమి పైపొర, భూసారాన్ని కొట్టుకుపోకుండా అరికట్టవచ్చు.
- లోతు దుక్కుల వల్ల భూమిలో నీరు ఉండి, తేమ శాతం పెరగడం వల్ల సేంద్రీయ పదార్థాలు త్వరగా కుళ్ళి పోషకాల రూపంలో అందుబాటులోకి వస్తాయి.
- భూమిని అడుగు లోతు వరకు దున్నుకుంటే విత్తనం మొలకెత్తి, వేర్లు సులభంగా భూమిలోకి దిగి, భూమిలో ఉండే పోషకాలను గ్రహించి, మొక్క పెరుగుదలకు తోడ్పడుతుంది.
- పంట పొలాల్లో లోతు దుక్కులు దున్నడం వల్ల భూమిలో దాగి ఉన్న చీడ పీడలు, కోశస్థ దశలో ఉన్న పురుగులు, బాక్టీరియా, శిలీంద్రాలు, సిద్ధ బీజాలు, కలుపు మొక్కల ఎండ వేడికి నశిస్తాయి. పురుగుల్ని పక్షులు తినేయడంతో తెగుళ్ల బెడద తప్పుతుంది.
- పొలంలో మట్టి గడ్డలు తొలగిపోయి, మెత్తని మట్టి ఏర్పడి పంట త్వరగా పెరిగేందుకు దోహద పడుతుంది.

వేసవి దుక్కులు భూసారానికి మంచిది



పంటలను బట్టి వేసవి దుక్కులు చేసి, భూసారం పెంచి, రైతులు లాభం పొందాలి. తమ శాఖ ద్వారా లభించే సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసుకోవాలి. సబ్సిడీపై లభించే వనరులు పొంది, రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలి.

కె.చిన నూరిబాబు, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఇంటికే ఉచిత వైద్యం



వృద్ధురాలికి వైద్య సేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఇంటింటికీ వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. తణుకు, పైడిపర్రు, చివటం ప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా వెళ్లిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ 6గురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. సభ్యులు కె.రామమోహనరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఇంటి వద్దకు ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు వడ్లమాని పార్వతి, గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



బియ్యం పంపిణీ చేస్తున్న ట్రస్టీ చెన్నా జనార్థనరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికళ సేవలు అభినందనీయమని గౌరవాధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ కొనియాడారు. ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికళ అన్నారు. జీవన్ సంధ్యా వృద్ధాశ్రామనికి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దాత వాణిచే 200 కేజీలు బియ్యం, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంకు 150కేజీల బియ్యం, నిడదవోలు లెప్పర్సీ కాలనీవారికి 300కేజీల బియ్యాన్ని ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నా జనార్థనరావు అందజేశారు. దుర్గా ప్రసాద్, నాగరాజు, తదితరులు పర్యవేక్షించారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్



బెల్టుషాపు నిర్వాహకుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ ఎస్సై

తణుకు అర్బన్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న గంత సత్యనారాయణను అరెస్టుచేసి అతడి నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై ఆర్.మధుబాబు, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి హెచ్చరించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తిరుపతి జిల్లా, చంద్రగిరి సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను అదే కళాశాలలో చదువుతున్న మరో ఉన్నత కులానికి చెందిన విద్యార్థి యశ్వంత్ తరుచూ కులం పేరుతో దూషించడంతో పాటు దాడులు చేస్తున్నాడని, తక్షణమే యశ్వంత్‌పై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కోరారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఈ ఘటనలో జేమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అమలు చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అడిదల రాజబాబు, జోసెఫ్, మోషే, తదితరులు మాట్లాడారు.

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు

ఆకివీడు: విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కూటమి విద్యా సంస్కరణలు ఉన్నాయని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించడం అశాస్త్రీయమైన నిర్ణయమని, తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థి నిష్పత్తిని 1:35గా 45 తరువాత 2వ విభాగం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ చేయడం సరైన పద్ధతి కాదని, బదిలీల్లో అన్ని ఖాళీలను చూపించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి మే 21న జిల్లాలోని విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడి చేసేందుకు ఉపాధ్యాయులు, ఐక్య ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం



రేలంగిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త



రేలంగిలో రోడ్డు పక్కన లాగి అక్కడే వదిలేసిన చెత్త

- ఎక్కడి చెత్త అక్కడే.. మురికి కూపాలుగా వీధులు
- పట్టించుకోని అధికారులు.. రోగాల బారిన ప్రజలు

ఇరగవరం: స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అని కూటమి ప్రభుత్వం మాటలు చెబుతుంటే గ్రామాల్లో ఇందుకు విరుద్ధంగా చెత్త భారత్, చెత్త ఆంధ్రప్రదేశ్‌గా ఉంది. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. పట్టించుకోవలసిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. ఇరగవరం మండలంలో 21 గ్రామాలు ఉండగా అందులో 17 మైనర్ పంచాయతీలు 4 మేజరు పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో చెత్త శుభ్రం చేయాడానికి జనాభా ప్రాతిపదికన 65 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాలి. కాని ప్రస్తుతం 50 పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. అయితే గ్రామాల్లో రోజు రోజుకూ పేరుకుపోతున్న చెత్తకు, పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సంబంధం లేదు. దీంతో చేసేది లేక ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. సిబ్బందితో సరిగ్గా చేయించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు వస్తున్నాయి.

గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు

రేలంగి, అర్జునుడుపాలెం, కత్తవపాడు, తూర్పువిప్పర్రు, కాకిలేరు, అయినపర్రు, గోటేరు, ఏలేటిపాడు, ఇరగవరం గ్రామాల్లో చెత్త ఎక్కడికక్కడ పారవేస్తున్నారు. తూర్పువిప్పర్రు, ఏలేటిపాడు, అయితంపూడి, పేకేరు, రాపాక, గ్రామాల్లో చెత్తను కాలువ పక్కన పారవేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ షెడ్లు మాత్రం నిరుపయోగంగా ఉన్నాయి. చెత్త మాత్రం రోడ్ల పక్కన, చెరువు, కాలువ, పుంత గట్ల పక్కన దర్శనం ఇస్తుంది. చెత్త పేరుకుపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు దోమలు ఎక్కువగా పెరుగుతున్నాయి. దీనికి తోడు బురద ఏర్పడి దుర్వాసన వస్తుంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రేలంగి, కె.ఇల్లిందలపర్రు, ఇరగవరం తూర్పువిప్పర్రు, అర్జునుడుపాలెం గ్రామాల్లో రోడ్డు పక్కన చెత్తను జేసీబీతో పక్కకు లాగి వదిలేశారు. దీంతో చెత్తకుప్పలుగా దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి గ్రామాలను శుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు చెత్త తొలగిస్తున్నాం

గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. అయితే కొన్ని గ్రామాల్లో ప్రజలు చెత్తను రోడ్ల మీద, కాలువల పక్కన వేస్తున్నారు. వారికి ఎన్నిసార్లు చెప్పినా అలాగే చేస్తున్నారు. ఏలేటిపాడులో కాలువ పక్కన శుభ్రం చేయించాం. రేలంగిలో డంపింగ్‌యార్డు సమస్య ఉంది దాన్ని పరిష్కరించాలి. గ్రామాల్లో అధికారులు అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– ఎస్‌వీవీ నరసింహమూర్తి, ఇరగవరం, ఈవోపీఆర్‌డీ

ఘనంగా అంకాలమ్మ జాతర



అంకాలమ్మను దర్శించుకుంటున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅంకాలమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని పూరి గుడిసె నుంచి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు పలు రకాల పిండి వంటలు నివేదించగా గ్రామమంతా కోలాహలంగా మారింది. అమ్మవారిని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, కనుపూరి ఉదయ భాస్కర్, బొద్దాని శ్రీనివాస్, బండి గణపతి, సిర్రాపు శాంతకుమార్, పులమోలు వెంకటేశ్వరరావు ప్రభృతులు దర్శించుకున్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కంటి వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ మదన్‌మోహన్ అగర్వాల్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాత పదం కుమార్ గుప్తా ఆర్థిక సాయంతో నిడదవోలు రాజరాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వారిచే ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం స్థానిక కడకట్ల జనత ట్రస్ట్ ఆవరణలో డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించారు. వైద్య శిబిరంలో 87 మందికి ఉచిత్ర నేత్ర వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా 20 మందికి కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ల నిమిత్తం 10మందిని, ప్రత్యేక ట్రీట్‌మెంట్ నిమిత్తం 7గురిని నిడదవోలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్, అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి పర్యవేక్షించారు. గరికపాటి బాపయ్య శర్మ, మట్టే వెంకన్న, యర్రా ఆంజనేయస్వామి, సంపత్ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కంటి వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు



శశిలో పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు



శ్రీవాసవిలో పరీక్షా కేంద్రం నుంచి బయిటకు వస్తున్న అభ్యర్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ వ్యాప్తంగా ఐఐటీలలో ప్రవేశాలకు గాను నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు తాడేపల్లిగూడెంలోని రెండు కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. శశి ఇంజనీరింగ్, వాసవి ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. శశి కాలేజీ పరీక్ష కేంద్రంలో షిఫ్టుకు 240 మంది చొప్పున హాజరు కావాల్సి ఉండగా, రెండు షిఫ్టులకు కలిపి 480 మందికి గాను 478 మంది హాజరయ్యారు. వాసవీ కాలేజీలో 136 మందికి గాను 135 మంది పరీక్షలకు హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ మూర్తి, టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పరీక్షలను పర్యవేక్షించారు. ప్రత్యేక అవసరాలు గల పీడబ్ల్యూడీ అభ్యర్థులు పరీక్షలు రాయలేదు.

కళాకారుల సంఘ సేవలను విస్తృతం చేస్తాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నెలవారీ కళాకారుల సంఘ సేవలను మరింత విస్తృతం చేస్తామని బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు అన్నారు. పట్టణంలోని బీవీఆర్‌లో ఆదివారం రాత్రి నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక, సమాహారం ఏర్పాటు చేశారు. అశోక్ ఈవెంట్స్ వారిచే నృత్య ప్రదర్శనలు, నాయకురాలు కసిరెడ్డి మధులతకు గౌరవ సేవా పురస్కారం, ఢీ డాన్స్ విన్నర్ మహా శివభట్ల అశోక్ కుమార్‌కు కళా పురస్కారం, పోలుకొండ శివ కుమార్‌కు ఉద్యోగ సేవా పురస్కారం, పేద కళాకారుడికి ఆర్థిక సత్కారం చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఎన్‌వీ రమణారావు పర్యవేక్షించారు.

త్రివిధ దళాలకు మద్దతుగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

తణుకు అర్బన్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత త్రివిధ దళాలకు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఉదయం నిర్వహించిన ర్యాలీలో భారీ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. తణుకు మున్సిపల్ కార్యాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా వెంకటేశ్వర థియేటర్ వరకు జై జవాన్ నినాదాలు, వందేమాతర గీతంతో ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, పలు ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు రాజకీయ నాయకులు, విద్యా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

కాళ్ల: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ ఉపయోగపడుతుందని, వాహనదారులు హెల్మెట్ ధరించాలని కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనుకోని పరిస్థితుల్లో జరిగే ప్రమాదాల్లో హెల్మెట్ ఉండడం వలన ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డ ప్రాణాలు అనేకం ఉన్నాయని, హెల్మెట్ ధరించాలని సూచించారు.

21న యూపీఎఫ్ సమావేశం

ఉండి: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యూపీఎఫ్) మండల సమావేశం ఈ నెల 21వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు ఉండి శివారు నక్కరాజు గుంట క్రీస్తు సంఘ చర్చిలో బ్రదర్ తెనాలి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు రెవరెండ్ ఎస్.పీటర్, వై.యోనాతాను తెలిపారు. యూపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రదర్ మేడిద జాన్సన్ నాయకత్వంలో నిర్వహించే ఈ సమావేశానికి ఫెలోషిప్ సభ్యులు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

పుస్తక సమీక్షతోనే జ్ఞానం



తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



అత్తిలి: గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుస్తక సమీక్షతోనే జ్ఞానమని పలువురు రిసోర్స్ పర్సన్లు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరం బాల బాలికలచే నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే అక్బర్, బీర్బల్ కథలు చెప్పారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, తల్లి పాత్ర ఎంతో కీలకమన్నారు. కోపల్లె శ్రీనివాస్‌రావుచే దేశభక్తి గీతాలు, కె.కొండలరావుచే జనరల్ నాలెడ్జ్, జి.బాపయ్య శర్మచే ఇంగ్లిష్ గ్రామర్, ఇతర అంశాలు చెప్పించారు. గంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పుస్తక పఠనంపై శిక్షణ

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనం, పేపర్ రీడింగ్‌తో పాటు కథలు చెప్పడం, వేమన పద్యాల తాత్పర్యం, తదితర అంశాలపై రిటైర్డ్ గ్రంథ పాలకుడు గంధం శేషవేంద్రరావు శిక్షణ ఇచ్చారు. రిసోర్సు పర్సన్ కె.కోమలి తెలుగు వ్యాకరణంపై పట్టు సాధించేందుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు, కె.రాజేష్, పి.వెంకటేశ్వరరావు, ఎన్.దుర్గా ప్రసాద్, వి.లక్ష్మణరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను తోడేస్తున్నారు

- విచ్చలవిడిగా బోర్లు వేస్తున్నా పట్టించుకోని అధికారులు



యండగండిలో బహిరంగంగానే బోరు వేస్తున్న ఆక్వా రైతు

ఉండి: ఆక్వా సాగులో అక్రమాలకు అంతులేదన్నట్లుగా సాగుతుంది మండలంలోని తీరు. బోర్లు వేసి ఉప్పునీటితో ఆక్వా సాగు చేయకూడదంటూ ఓ వైపు అధికారులు ఆదేశాలిస్తున్నా నూటికి 90 శాతం మంది ఆక్వా రైతులు బోర్లు వేసి ఉప్పు నీటితోనే సాగు చేస్తున్నారు. ఆక్వా రైతులు ఎంతగా అధికారులపై అజమాయిషీ చలాయిస్తున్నారని చెప్పేందుకు యండగండిలో జరుగుతున్న బోరు త్రవ్వకం ఓ ఉదాహరణ. బోరు వేస్తున్న సంగతిని స్థానికులు గ్రామ వీఆర్వోకు చేరవేస్తే సదరు అధికారి ఆక్వా చెరువు యజమానిని ఆరా తీశారు. అయితే సదరు రైతు మాత్రం మీరే మాకు అనుమతులిచ్చారు కదా ఇప్పుడెందుకు ఆపాలంటూ అధికారిపై అడ్డం తిరిగాడు. అంటే మండలంలో అధికారుల తీరు ఈ విధంగా ఉంటే భూగర్భ జలాలే కాదు ఏదైనా తోడేస్తారని పలువురు విమర్శిస్తున్నారు. అడ్డుకోవలసిన అధికారులు చేతులెత్తేస్తుంటే దీని వెనుక ఉన్న పరమార్థం ఏమిటోనని ప్రజలు గుసగుసలాడుతున్నారు. అయితే కళ్ల ముందు ఇంత జరుగుతున్నా దానిని ఆపేందుకు గాని అనుమతి లేకుండా బోరు వేస్తున్న రైతుపై చర్యలు తీసుకునేందుకు గాని అధికారులు ముందుకు రాకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పూర్తవుతున్న ఆలయాల పునర్నిర్మాణం



పునర్నిర్మించిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం



పునర్నిర్మాణం చేసిన శ్రీసీతారామలింగేశ్వర స్వామి దేవస్థానం

- వైఎస్ జగన్ హయాంలో దాదాపు పూర్తి
- శ్రీరామలింగేశ్వరస్వామి వారి దేవస్థానానికి రూ.కోటి నిధులు
- పట్టణంలో రెండు దేవస్థానాల పునర్నిర్మాణం

భీమవరం(ప్రకాశం చౌక్): దేవదాయశాఖకు చెందిన పురాతన ఆలయాల అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవస్థానాల జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టి దెబ్బతిన్న ఆలయాలు, వాటి ప్రాంగణాలు, పునర్నిర్మాణం చేసి ఆలయాలకు పూర్వ వైభోగం సంకల్పించారు. నాడు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి నూతన ఆలయాలను నిర్మించే దైవ కార్యక్రమం చేశారు. నిర్మాణం చేస్తున్న ఆలయాలకు ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ గ్రాంట్ (కామన్ గుడ్ ఫండ్) నుంచి నిధులు మంజూరు చేశారు. ఆలయాల నిర్మాణానికి అయ్యే ఖర్చులో 67 శాతం నిధులు ప్రభుత్వం అందించగా 33 శాతం మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ దేవస్థానం తరపున ఖర్చు చేశారు. దీనిలో భాగంగా భీమవరం నియోజకవర్గంలో నాలుగు దేవస్థానాల పునర్నిర్మాణం చేశారు.

రూ.2.93 కోట్ల ఖర్చు

భీమవరం నియోజకవర్గంలో నాలుగు దేవస్థానాలు పునర్నిర్మాణానికి నాడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.2,93,32000 నిధులు ఖర్చు చేశారు. పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం (సుబ్బరాయుడి గుడి)కి రూ.కోటి రూపాయలు, శ్రీసీతారామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.66 లక్షలు, కొమరాడ శివకేశస్వామి దేవస్థానానికి రూ.66 లక్షలు నవుడూరు రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.60 లక్షలు నిధులు కేటాయించారు. వాటిలో భీమవరంలోని శ్రీరామపురం శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం, ప్రభుత్వ ఆసుపత్రి సమీపాన ఉన్న శ్రీసీతారామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణం పూర్తి కావడంతో ఇటీవల ఈ రెండు దేవస్థానాలు పున:ప్రతిష్ఠ పూర్తి చేశారు. కొమరాడ శివకేశవ స్వామి దేవస్థానం, నవుడూరు శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం నిర్మాణంలో ఉన్నాయి. ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన సీజీఎఫ్ గ్రాంట్ కాకుండా దాతలు ఆర్థిక సాయాన్ని అందించారు.

2014–2019 మధ్య దేవస్థానాల అభివృద్ధి శూన్యం

గతలో 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనలో దేవస్థానాల అభివృద్ధి శూన్యం. దేవస్థానాల ఆస్తులు, భూముల నుంచి ఆదాయం తీసుకోవడం తప్పా శిథిలావస్థలో ఉన్న, దెబ్బ తిన్న ఆలయాల పునర్నిర్మాణం గురించి చంద్రబాబు పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా విపత్తు తరువాత కేవలం మూడేళ్లలో దేవస్థానాల అభివృద్ధి చేపట్టి దైవభక్తి చాటుకున్నారు. దేవస్థానాలకు ఆదాయం ఉన్నా లేకున్నా వాటి అభివృద్ధిని భాద్యతగా తీసుకొని ఆలయాల పునర్నిర్మాణం చేపట్టారు.

గత ప్రభుత్వంలో ఆలయాలకు మహర్దశ



గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆలయాలకు మహర్దశ పట్టించారు. పట్టణంలో రెండు దేవస్థానాలకు నాడు నిధులు కేటాయించారు. అలాగే దాతలు కూడా ఆర్థిక సాయం అందిచడంతో వేగంగా ఆలయాలను పునర్నిర్మించారు. పట్టణంలోని రెండు ప్రముఖ దేవాలయాలకు నూతన ఆలయాలను నిర్మించడం సంతోషించదగ్గ విషయం.

– మారోజు గణేష్, భీమవరం

మూగ జీవాలకు నీటి తొట్టెలు

భీమవరం: మండు వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గో–సంరక్ష సమితి అధ్యక్షుడు సుంకర దాసు మిత్ర బృందం ప్రధాన సెంటర్లలో ఆలయాల వద్ద నీటి తొట్టెలు పెట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుంకర దాసు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ ఏడాది సిమెంట్‌తో తయారు చేసిన 200 నీటి తొట్టెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వేణు ఆర్ట్స్ సౌజన్యంతో తొట్టెలకు మూగ జీవులను రక్షిద్దాం అనే నినాదంతో రంగులు వేసి ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారని, మనసున్న ప్రతి ఒక్కరూ మన ఒంతుగా ఈ తొట్టెల్లో నీటిని ఉంచాలని, ఆసక్తి ఉన్న జంతు ప్రేమికులకు నీటి తొట్టెలను అందిస్తున్నామన్నారు. దయచేసి వీటిని డస్ట్ బిన్లుగా ఉపయోగించొద్దని మనవి చేశారు. త్వరలో జిల్లా కలెక్టర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల చేతుల మీదుగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, అశోక్ యాదవ్, కళ్యాణ్ డిన్ను, సింహాచలం పాల్గొన్నారు.